

# రికార్డుల రారాజు..

ఖమ్మం లోక్‌సభ స్థానానికి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన నామా నాగేశ్వరరావు ఆల్ టైం రికార్డు విజయం సాధించారు. గతంలో 1952 నుంచి ఖమ్మం ఎంపీ స్థానానికి జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీలలో ఎవరూ సాధించని రికార్డు స్థాయి విజయాన్ని అందుకున్నారు. ఈ గెలుపుతో ఎంపీ నామ తన సత్తా చాటుకుని ఖమ్మం పార్లమెంటులో తనకు తిరుగులేదని నిరూపించారు. గతంలో టీడీపీ తరపున, తాజాగా టీఆర్ఎస్ పార్టీ తరపున పోటీచేసి రికార్డు విజయాలు నమోదు చేసి నామ నాగేశ్వర రావు ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీ యాల్లో తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఖమ్మం పార్లమెంటు బరిలో ఇప్పటి వరకూ నమోదైన రికార్డుల పరంపరను ఎంపీ నామ ఏ విధంగా తిరగ రాశారో తెలుసుకోవాలంటే ఒక సారి ఈ కథనం చదవాల్సిందే.

వనం నాగయ్య, కెరటం న్యూస్

# ఎంపీ 'నామ'..

## ఖమ్మం లోక్‌సభ పోరులో రెండు అత్యుత్తమ విజయాలు

| సంవత్సరం | గెలిచిన అభ్యర్థి | మెజార్టి |
|---|---|---|
| 1952 | టీబీ విఠల్ రావు (పీడీఎఫ్) | 72,632 |
| 1957 | టీబీ విఠల్ రావు (పీడీఎఫ్) | 05,537 |
| 1962 | టీ.లక్ష్మీకాంతమ్మ (కాంగ్రెస్) | 12,060 |
| 1967 | టీ.లక్ష్మీకాంతమ్మ (కాంగ్రెస్) | 1,11,338 |
| 1971 | టీ.లక్ష్మీకాంతమ్మ (కాంగ్రెస్) | 49,212 |
| 1977 | జే. కొండలరావు (కాంగ్రెస్) | 85,989 |
| 1980 | జే. కొండలరావు (కాంగ్రెస్) | 95,483 |
| 1984 | జలగం వెంగళరావు (కాంగ్రెస్) | 91,499 |
| 1989 | జలగం వెంగళరావు (కాంగ్రెస్) | 59,252 |
| 1991 | పీవీఆర్ నాయుడు (కాంగ్రెస్) | 05,918 |
| 1996 | తమ్మినేని వీరభద్రం (సీపీఐ(ఎం) | 63,291 |
| 1998 | నాదెండ్ల భాస్కరరావు (కాంగ్రెస్) | 11,664 |
| 1999 | రేణుకా చౌదరి (కాంగ్రెస్) | 08,398 |
| 2004 | రేణుకా చౌదరి (కాంగ్రెస్) | 1,08,888 |
| 2009 | నామ నాగేశ్వరరావు (టీడీపీ) | 1,24,448 |
| 2014 | పొంగులేటి శ్రీనివాసరెడ్డి (వైసీపీ) | 12,204 |
| 2019 | నామ నాగేశ్వరావు (టీఆర్ఎస్) | 1,68,062 |

## ఖమ్మం ఎంపీగా ఆల్ టైం రికార్డు విజయం

- ఖమ్మం లోక్‌సభ పోరులో రెండు అత్యుత్తమ విజయాలు నామాకే
- ఖమ్మం బరిలో నిలిచి, టీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేతగా ఎన్నిక
- పార్లమెంటులో తన గళంతో బీజేపీని ఇరుకున్న పెడుతున్న ఎంపీ
- ఓటమి నుంచి గెలుపు రుచి చూసిన ఎంపీ నామ
- జిల్లా ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న ఎంపీ నామ



## రికార్డుల్లో టాప్ ఎంపీ నామ..

ఖమ్మం ఎంపీ స్థానానికి గతంలో జరిగిన ఎన్నికల్లో 2009లో టీడీపీ అభ్యర్థిగా నామా సాధించిన 1,24,448 ఓట్ల మెజారిటీయే ఇప్పటి దాకా అత్యుత్తమ విజయం. కాగా 2019లో వెల్లడించిన పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో నామా సాధించిన 1,68,062 ఓట్ల మెజారిటీ ఆల్ టైం రికార్డుగా నమోదైంది. దీంతో గతంలో తను నమోదు చేసిన రికార్డును తానే అధిగమించినట్టయింది. సీఎం కేసీఆర్‌తో నామాకు ఉన్న సాన్నిహిత్యం, సత్సంబంధాలను బట్టి గెలుపొందిన ఎంపీల్లో నామాయే సీనియర్ కావడంతో టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేతగా ఎన్నికయ్యారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలోని మధిర, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, వైరా, అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాలున్నాయి. వీటిల్లో మొత్తం ఓటర్లు 15 లక్షలకు పైగా ఉన్నారు. వీరిలో 11,39,484ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన నామా నాగేశ్వరరావుకు 5,67,459 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థి మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరికి 3,99,397 ఓట్లు పోలయ్యాయి. సీపీఐ(ఎం) అభ్యర్థి బీ. వెంకట్‌కు 57,102 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి దేవకి వాసుదేవరావుకు 20,488 ఓట్లు, నోటాకు 15,832 ఓట్లు పోల య్యాయి. ఈ లెక్కన టీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వ రరావు తన సమీప ప్రత్యర్థి రేణుకా చౌదరిపై 1,68,062ఓట్ల మెజారిటీతో రికార్డు స్థాయి విజయం సాధించారు.

### ఓటమి నుంచి గెలుపు రుచి చూసిన ఎంపీ నామ

2019లో పార్లమెంటు ఎన్నికలకు సరిగ్గా ఐదు నెలల ముందు 2018 డిసెబర్ నెల లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో టీడీపీ అభ్యర్థిగా ఖమ్మం ఎమ్మెల్యేగా పోటీ చేసిన నామా నాగేశ్వరరావు తన సమీప ప్రత్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ (టీఆర్ఎస్) చేతిలో సుమారు 10991 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. ఈ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 2,73,973 ఓట్లు ఉండగా అందులో 2,06,428 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్‌కు 1,02,760 ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగిన నామా నాగేశ్వరరావుకు 91,769 ఓట్లు పోలయ్యాయి. శాసనసభ ఎన్నికల్లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పది నియోజకవర్గాల్లో కేవలం ఖమ్మం నియోజకవర్గం మినహా ఎక్కడా గెలవ లేదు. దీంతో సీన్ పూర్తిగా మారిపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత గెలిచిన అభ్యర్థులపై కన్నేసిన టీఆర్ ఎస్ అధిష్టానం తొలుత శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజే వైరా నుంచి ఇండిపెండెంట్‌గా బరిలో దిగి గెలిచిన



### మెజార్టీలో అల్‌టైం రికార్డు నామా సొంతం

టీఆర్ఎస్ ఎంపీగా గెలుపొందిన నామా విజయం ఆల్‌టైం రికార్డు కావడం గమనార్హం. ఇప్పటివరకూ జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది. ఇప్పటికి తాజా ఎన్నికలతో పోల్చిచూస్తే అత్యుత్తమంగా నిలిచిన తొలిరెండు విజయాలు కూడా నామా నాగేశ్వరరావుకే దక్కడం మరో విశేషం. ప్రధానంగా 2009లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నాడు టీడీపీ తరపున పోటీ చేసినా నామా అప్పటి వరకూ ఎవరూ సాధించని 1,24,448 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తాజా ఎన్నికల్లో తన రికార్డును తానే బద్దలు కొట్టిన నామా అత్యుత్తమ ఆల్ టైం రికార్డును సాధించడం గమనార్హం. ఈ ఎన్నికల్లో ఏకంగా 1,68,062ఓట్ల మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి రేణుకాచౌదరి పై ఘన విజయం సాధించారు.

లావుడ్యా రాములు నాయక్ కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ లో చేరారు. అనంతరం కాంగ్రెస్ తరపున గెలిచిన పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఆ తరువాత ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరి ప్రియ, పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, కొత్త గూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు టీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మారిన కొద్ది రోజులకే సత్తుపల్లి నుంచి టీడీపీ తరపున గెలుపొందిన సండ్ర వెంకటవీరయ్య కూడా టీఆర్ఎస్ గూటికే చేరారు. అనంతరం అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వ రరావు కూడా గులాబీ గూటికి చేరారు. ఇలా రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయి మూడు నెలల్లోనే టీఆర్ఎస్‌కు ఉమ్మడి జిల్లాలో గట్టిపట్టు చిక్కింది.

### టీడీపీకి నామ రాజీనామా.. గులాబీ గూటికి

రాష్ట్రంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మారిన పరిస్థితుల దృష్ట్యా తనకు రాజకీయంగా దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని కల్పించిన కల్పతరువు లాంటి టీడీపీ పార్టీని నామా వీడాల్సి వచ్చింది. వేగంగా మారుతున్న పరిస్థితులను అర్ధం చేసుకున్న నామా ఎంపీ ఎన్నికల



సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో పదవికి రాజీనామా చేసి సీఎం కేసీఆర్ పిలుపు మేరకు టీఆర్ఎస్‌లో చేరారు. చేరీ చేరడంతోనే నామాకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని టీఆర్ఎస్‌లో నెలకొన్న తీవ్రమైన వర్గపోరు కలిసొచ్చింది. ఓ పక్క తాజా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మధ్య తీవ్రమైన వర్గ పోరుతో పార్టీ తొమ్మిది స్థానాల్లో ఓటమి చెందిందని నివేదికలందుకున్న సీఎం కేసీఆర్ వీరిద్దరికీ కాదని, ఇదే జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త వీవీసీ మోటార్స్ అధినేత వంకాయలపాటి రాజేంద్ర ప్రసాద్ పేరును ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా దాదాపు ఖరారు చేసి ఆ తరువాత సీఎం నేరుగా జరిపిన సర్వేలో నామాకు అత్యుత్తమ మార్కులు రావడంతో అనూహ్యంగా ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామాను టీఆర్ఎస్ తరపున బరిలోకి దింపారు. అంతేకాక గత శాసనసభ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాలను రిపీట్ చేస్తే ఇక్కడి నాయకత్వానికి భారీ కుదుపు తప్పదని పరోక్షంగా హెచ్చరికలు పంపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నామా గెలుపు ఖాయం కావాలని హెచ్చరించడంతో నియోజకవర్గాల్లో అన్ని వర్గాల నాయకులు కృషి చేసి గతంలో ఏ ఎంపీ సాధించని విధంగా 1,68,062 ఓట్ల మెజారిటీతో నామాను గెలుపుబాటలో నడిపించారు.



